# రాబందు

ఎద్దు దబ్బిం పీక్కుతింటున్న కాకులు, గద్దలు, పీతురుగద్దలు రాబందులను చూస్తుంటే మూర్తి కళ్లు కుట్టాయి—వొళ్లు మండింది.

తను పెళ్లికొడుకయిన రోజు పుట్టిన దూడ, తన దాంపత్య జీవిత ఆనందంలాగా, లేగదూడగా, కోడెదూడగా పెరిగి, అరక కట్టటానికి అర్రిచ్చి; తన సంసారం బరువులాగా అరక దున్ని బండిలాగీ, తను బాధలతో వేగలేకపోయినట్లే అర్రువాచి, పిల్లలులేని, సంతానం కలగదని, తెలిసిన తర్వాత మొదటి భార్యను తను ఏలకుండా పుట్టింటికి తరిమేస్తే, ఆమెవచ్చి, భర్త లేని మెట్టినింట పడిగాపులు పడుతూవున్నట్టే. సావిట్లో పడి కదలకుండా మెదలకుండా వున్న ఎద్దు; పిల్లలకోసం రెండో పెళ్లి చేసుకొంటే, రెండో భార్య కోర్కెలకు గోడలు లేక పోయి, డబ్బు చాలకపోయి, లంచాలు చేతనయినంతగా తీసుకొని, జీవితం, భయంతో ఆనందంగా గడుపుతున్న కాలంలో, లంచాల విషయం గుర్తించిన ప్రభుత్వంతో సమా ధానాలు కాగితాలమీద పంపుకొంటున్న కాలంలో ఎదురింటి యువకుడితో అందినంతవరకు జమచేసుకొని ఎక్కడికో వెళ్లి పోయిన రెండో భార్యను వెతుక్కొంటున్న కాలంలో ఊడిన ఉద్యోగం గోలవిని, అటు రెండో భార్య—ఆమె సొంతం చేసుకొన్న డబ్బు, ఇటు ఊడిన ఉద్యోగం వెతుక్కొంటూ,

సి. పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయము

ఆకలికి తాళలేక, అన్నమో రామచంద్రా అనలేక, అయిన వాడికి అన్నీ అమర్చుకోని, ఉన్నంతకాలం ఉన్న చోటే ఉండి, ఉండలేకపోయినప్పుడు ఉన్న ఊరు వచ్చి, మొదటి భార్య కళ్లలో నీళ్లు చూడలేక [illegible]పోయిన ఎద్దును సావిట్లో చూడలేకపోయాడు మూర్తి.

జీతగాడు వచ్చి పుణ్యాం కట్టుకోని, ఎద్దును బండిలో తోలుకుపోయి, సమాధుల్లో పడేసి తోలువొలిచి, జీలపతీసి దట్టం అక్కడే పడేసి వెళ్లిపోయిం తర్వాత, దిక్కుతోచక సమాధుల్లోకి వచ్చి, కాకులు, గద్దలు, పీతురుగద్దలు, రాబందులు దట్టం పీక్కుతింటూంటే, ఎద్దు అంతిమ శరీర భాగాలు హరించిపోతుంటే, అది చూస్తుంటే, మూర్తికి కళ్లు కుట్టాయి. వొళ్లు మండింది.

అవి ముక్కా-ముక్కి రెక్కా-రెక్కి పోటీపడి దట్టం పీక్కుతింటుంటే చూడలేకపోయాడు మూర్తి. చేత్తో అదిలించాడు. అవి కదల్లేదు. సంతకం పెట్టను పొమ్మంటే వినకుండా మొరాయించి తండుకేసి తలుపులకు, కిటికీలకు, గోడకు వ్రేలాడుతున్న విద్యార్థుల్లాగా, మీ వూరు కాలవరాదు అంటే వినని రైతులులాగా, జమాబందీ లెక్కలు చెప్పలేని కరణం, మునసబుల్లాగా, ఏమి చేయాలో తెలియనప్పుడు ప్యూనును పిలిచే అలవాటుకొద్దీ అటూయిటూ చూశారు ఎక్స డిప్యూటీ తాసిల్దార్ మూర్తి.

అవి దట్టంమీద పడి ముక్కులలో పొడుస్తున్నాయి. గోళ్లతో రక్కుతున్నాయి. పిక్కఎముకల సందుల్లో మాంసం, ముక్కలు చేసి, పీక్కుతింటున్నాయి. చూడలేకపోతున్నాడు మూర్తి.

ఎక్కణ్ణుంచో వచ్చి, వేపచెట్టుమీద దిగి, అక్కణ్ణుంచి సరాసరి దళ్ళెం నడిబొడ్డున వ్రాలి, మెడదాకా నడిచి, ఎదురయిన వాటిని ఎటుబడితే అటేనెట్టి మెడమీద మాంసం పీక్కు తింటూవుంది ఒక రాబందు. యు.డి.సి. గా సెలెక్ట్ అయి, అనతికాలంలో డిప్యూటీ తాసిల్‌దారు అయిన గ్రాడ్యుయేట్ మూర్తిలాగా.

అవి కదలకపోతే రాయి తీసుకొని విసిరివేశాడు. రెండో మూడో లేచినట్టే లేచి, మళ్లీ వ్రాలి తమ పనిలో మునిగిపోయాయి. ఒక రాబందు మాత్రం జాలిగా చూచింది. ఆ పిల్లవాడి, చూపులాగా వుంది. 'బీదవాణ్ణి బాబు! తిండి లేనివాణ్ణి బాబు! డబ్బులేనివాణ్ణి బాబు! ఇల్లులేనివాణ్ణి బాబు! సంతకం చెయ్యండి బాబు! మీ జీతగాడులాంటి వాణ్ణి బాబు! సంతకం చెయ్యండి బాబు! మీరు సంతకం చేయకపోతే హాస్టలు సీటురాదు బాబు! తిండికే అల్లాడిపోతాను బాబు! సంతకం చెయ్యండి బాబు! ఇవాళే లాస్ట్ డేట్ బాబు! లేకపోతే స్కాలర్‌షిప్పు రాదు బాబు! ఈ ఒక్క సంవత్సరం నన్ను గట్టెక్కించండి బాబు! మీకు పుణ్యముంటుంది బాబు! సంతకం చెయ్యండిబాబు! చచ్చిపోతాను బాబు! కరణంగారు సంతకం చేశారు బాబు! మునసబుగారు సంతకం చేశారు బాబు! నేను బీదవాణ్ణే బాబు! అంతా అందులో రాసుకొన్నాను బాబు! దయతలచండి బాబోయ్! మీ కాళ్లు పట్టుకొంటాను బాబోయ్ బాబోయ్ బాబోయ్' ఆ పిల్లవాడి చూపులాగా వుంది రాబందు చూపు! ఆ రోజు నవ్వినట్టు నవ్వలేదు మూర్తి.

సంతకంచేస్తే అయిదు, కాలు కదిపితే పది పల్లెకుపోతే పాతిక, పని అయితే వందా—అయిదూ పదీ పాతికా వందా—అయిదూ పదీ పాతికా వందా!—కళ్లబడందే కలం కళ్లల్లో ఆనందం వెల్లివిరియదు. తలవంచదు. ముక్కు మోపదు.

ముక్కు మోపుతున్నాయి రాబందులు. మాంసం పీకుతున్నాయి, కడుపునిండా తినాలని తాపత్రయం. వంచిన తల ఎత్తటంలేదు.

మూర్తి వొంటిమీద తేళ్లూ జెర్రులూ ప్రాకుతున్నట్లు భరింపలేక పోతున్నాడు. వొంగి నాలుగు రాళ్లు తీసుకొని వరుసగా విసిరాడు. అవి కొన్ని చెట్టుమీదకు, కొన్ని ప్రక్కలకు, కొన్ని ఎడంగా వెళ్లాయి. దట్టెం ఖాళీగావుంది. మాంసం చాలావరకు పీక్కుతిన్నాయి. రక్తం మరకలూ, పేగులూ పేడా దట్టెం అసహ్యంగా వుంది. రెండడుగులు ముందుకువేసి ఇక ముందుకు పోలేక, దుర్గంధం భరించలేక, ముక్కు మూసుకోకుండా, దట్టెంవైపు చూశాడు.

ఏమనుకున్నాయో, ఏమో చెట్టుమీదనుంచి గబగబా దట్టెంమీద వ్రాలాయి కొన్ని. కొన్ని మూర్తి ముఖంలోకి చూస్తూ ప్రక్కలనుంచి నడిచి వస్తున్నాయి. రెక్కలతో ఎగురవలసినవి నడిచివస్తుంటే వింతగావుంది. చేసినతప్పు జెప్పుకొని, లంచం ఇచ్చి మన్నించమని ప్రార్థించే రైతులు—ప్రహారీగోడ గేటుతలుపు కిర్రుమనకుండా తీసి, వరండాలో నిశ్శబ్దంగా చెప్పులు విడిచి, మెడా, చేతులూ, కాళ్లూ, శరీరం లోపలికి కుంచించుకొని, ముడిచిన గొడుగులు మాదిరిగా ఆఫీసు గదిలోకివచ్చే రైతులు మాదిరిగా నడిచి వస్తున్నాయి.

అప్పుడానందమయిన నవ్వు, ప్రేగుల్లో పుట్టేనవ్వు, దొరికాడురా మేత అనుకొనే నవ్వు ఇప్పుడు కలగలేదు. వింతగా చూశాడు మూర్తి అని ఏమనుకున్నాయో, చూస్తూవుండగానే మళ్ళీ అన్నీ దబ్బెంమీద వ్రాలాయి.

అవి తనమాటను లెక్కచేయలేదని ఎక్కళ్లేని కోపం అక్కడికక్కడే వచ్చింది. అవి విరామంలేకుండా చిల్లపెంకంత మాంసం మిగులకుండా దబ్బెం పూర్తిగా పీక్కుతినాలని కృత నిశ్చయంతో వచ్చినట్టు వంచినతల ఎత్తకుండా ఉన్నాయి. తనంటే గుమాస్తాలు ఎదురురారు. కరణాలు కాళ్లూ చేతులు కట్టుకొని నిలబడతారు. మునసబులు ముక్కుమీద ప్రాణం పెట్టుకొంటారు. మరివేరే మనుష్యుల కథ చెప్పనక్కరేలేదు. ఇవి మనుష్యులులాగా లేవు. పక్షులు బాగావున్నాయి. పక్షులు పక్షులంటేను.

ఎర్రటి ఎండ. మండిపోతూవుంది. మూర్తి శరీరంలాగా, సుడిగాలివచ్చి వొగుడాకులుమీద చిమ్మి వెళ్లిపోయింది. చిరాకు పుట్టింది. రాయి పెద్దది. కళ్లయెదుట యూ.యన్.వో. శాంతిలాగా కనబడింది. బలంగా ఎత్తి ఓపికకొద్దీ విసిరి దబ్బెం మీద పడేశాడు.

దబ్బెం పక్క టెముకలు పెళపెళవిరిగాయి. రాయి దొర్లి పోలేదు. అక్కడేవుంది. ఒక్కటేలేదు. దాని క్రిందనుంచి, రెక్కమీద రాయిపడి, ప్రకటన గొంతెత్తి, ఒక రెక్క అల్లాడిస్తూ కావుకావుమని అరుస్తూవుంది కాకి!

మూర్తికి ఎంతో ఆనందం కలిగింది. పెద్దగా నవ్వుదా మన్నంత కోరెక్కపుట్టింది. ఆ మధ్య అంత ఆనందం. దాని

అమ్మ కడుపుమాడ—అతనికి కలగలేదు. వంకర్లు తిరిగిపోయాడు తృప్తిలో. సంతకం పెట్టకపోతే విలవిల్లాడే బీదవిద్యార్థిలాగా, శిస్తువసూలుకావటంలేదు. మరొకసారి వస్తే వ్యవహారాలు పరిష్కారం అవుతాయని అర్థించి కాదనిపించుకొన్న కరణం లాగా! నీమీద రిపోర్టు వ్రాసి పారేస్తాను, సీలుకు పావలా పుచ్చుకొంటున్నావని తెలిసిందని బెదిరిస్తే వణికిపోయే ప్యూను లాగా; వంశ పారంపర్యం లేదు. నా బొందలేదు నువ్వు పనికిరావని అతను పనికివస్తాడని ఫలానావాడికా ఉద్యోగం ఇవ్వవలసిందని టెస్టులు పాసయ్యాడని పైకిరాస్తానని బెదిరిస్తే అధికారం పోతుందేమోనని భయంతో కాళ్లా వేళ్లా పడే మునసబులులాగా గిలగిలా గిజిగిజా మజామజాగా తన్నుకొంటూవుంది కాకి! కాకి చిరకాలమున్న ఏ కార్యమగును?

కాకులన్నీ పోగయ్యాయి. ఒకటే రోధ! ఒకటే గోల! కావు! కావు! గోల గోల! రద్ది రద్ది!! చూస్తూనే వున్నాడు నాలుగు రాబంధులు! చూస్తూనే వున్నాడు! దున్నలులాగా ఎద్దుల్లాగా వున్నాయి. చూస్తూనే వున్నాడు! రెండు కాళ్ల గోళ్లు ఎనిమిదో పదో నాలుగు రాబందులు గట్టిగా ఆనించి—చూస్తూనే వున్నాడు—రాయి దొరకలేదు. ప్రక్కకు లాగుతుంటే కాకీవచ్చి, రెక్క లాక్కొని బాగుందనుకొని—చూస్తూనే వున్నాడు. ఎగరబోయి, కొంతెత్తు ఎగిరి ఒక్క రెక్కే ఉపయోగ పడుతుంటే, తెలియకుండా—చూస్తూనే వున్నాడు, ఎగరలేక నేలమీద పడి కొంతదూరం నడిచి, కూర్చుండిపోయింది కాకి! కాకి సతికిలబడింది. చుట్టూ కాకులు మూగాయి కావు! కావు! కాకిగోల!' రిమిషన్ అంతా పంచి పెట్టాను దొరగారూ! కావాలంటే మునసబుగారిని అడగండి

దొరగారూ! అది చావు బ్రతుకుల్లోవుంది దొరగారూ! పిల్ల వాడు హాస్పిటల్లో ఉన్నాడు దొరగారూ! మీకిచ్చేది మీ కిచ్చేనుగా దొరగారు—నోర్ముయ్—నన్నన్యాయం చేయకండి దొరగారూ! రసీదులు పుచ్చుకోలేదు. దొరగారు తప్పయి పోయింది దొరగారు! ఆ రెండెకరాలే నా భుక్తి దొరగారు. ఈ కరణీకం ఏముంది దొరగారు! ఈ రోజుల్లో అదెంతమాత్రం దొరగారు, ఆ పొలం జప్తు చేయించకండి దొరగారు! ఈ ఉసురు మీకు తగులుతుంది దొరగారు—నోర్ముయ్—మీరు కుక్క చావు చస్తారు దొరగారు—నోర్ముయ్ నన్ను కాపాడండి దొర గారు. వాళ్లు బయలుదేరారు దొరగారు. పొలం జప్తు చేస్తారు దొరగారు మీరింత తినండి దొరగారు—నోర్ముయ్. ఈ గోల ముందేమయింది—ఇప్పుడింక చేసేదేముంది. నన్ను బ్రతికించండి దొరగారూ!—పో అవతలకి.

ఆ కరణం కాకిగోలలాగా వుందీ కాకిగోల! గద్దలు, రాబందులు, పీతురుగద్దలు, కాకులు అన్నీ దట్టం విడిచి పెట్టాయి. ప్రక్కకు పోయాయి. లేచిపోలేని మూర్తిని చూస్తూ కూర్చున్నాయి. శవం చుట్టు చేరి ఆడవాళ్లు ఏడుస్తుంటే పంచెలు నెత్తిమీద వేసుకొని, దిగాలుపడి మెల్చా మీద కూర్చున్న మగవాళ్లలాగా ఉన్నాయి రాబందులు.

తోలకుండా వెళ్లిపోయాయి. దెబ్బతో వెళ్లిపోయాయి. ఎముకలు విరిగి అంతదాకా పీకినా వెలుపలికి రాని మాంసం బైటికి వచ్చింది. అయిన అవి తినటంలేదు. దగ్గరనె రావటం లేదు.

చనిపోయినప్పుడు నిర్జీవంగా వుంది ఎద్దు, తోలు వొలిచి నప్పుడూ నిర్జీవరగా వుంది, అవి అన్నీ దానిమీదపడి తింటు

న్నప్పుడు సజీవంగా వుంది దశ్యం, ఇప్పుడు మళ్లీ నిర్జీవంగా అయి పోయింది.

ఒక్క పక్షీ వెళ్లిపోలేదు. అన్నీ అక్కడే ఒంటరిగా జంటలు గుంపులుగా ముఠా రాజకీయాలు ప్రదర్శిస్తున్నాయి ఫూల్స్! తనంటే ఏమనుకుంటున్నాయో!

ఒక రాబందు తనవైపు కోపంగా చూస్తూవుంది, ఈ చూపు ఎక్కడో చూచిన గుర్తు! తను మర్చిపోకుండా ఆ మునసబులును.

మూర్తీ! చిన్నవాడివి. పైకిపోవలసినవాడివి. పెద్దవాణ్ణి చెప్తున్నా విను—గెటౌట్—నా కింత రానివ్వు నువ్వింత తీసుకో—గెటౌట్—నీకియ్యవలసింది ఎప్పుడూ మోసం చేయలేదు. నా మీద ఆ కాగితాలు కమామిసు ఎందుకు, వద్దు చెడిపోతావు—గెటౌట్—నువ్వు నా మాట వినకపోతే నష్టపోతావు. ఇంత ఆశ పనికిరాదు. దేనికయినా హద్దుండాలి గెటౌట్—దొంగతనం చెయ్ తప్పులేదు. లంజతనం చెయ్ తప్పులేదు. హద్దుండాలి! హద్దు!—గెటౌట్—లంచం తీసుకో! మరీ యింత అన్యాయం పనికిరాదు. నువ్వు నా మాట విను. లేకపోతే చెడిపోతావు నా మీద ఏమిటా పాడు రాతలు. నా మాట విను—గెటౌట్—నువ్వొకటి గుర్తించుకోవాలి. నన్ను వ్యతిరేకించినవాడు ఎవడూ బ్రతకలేదు. నువ్వు బ్రతుకుతావు పరవాలేదు అయితే అవిటిబ్రతుకు. గుర్తుంచుకో ఉద్యోగం లేందే నీకు కష్టం—రెండో పెళ్లాంతో గెటౌట్—బ్రతకటం కష్టమ్—గెటౌట్—నన్నిట్టా అనేవాడు రోజులు లేనివాడు. నూకలు లేనివాడు—

గెటౌట్—కలక్టరు మా వూరివాడేనన్న సంగతి గెటౌట్—ఎమ్మెల్లే మా తమ్ముడేనన్న విషయం—గెటౌట్—మర్చిపోవద్దు—గెటౌట్—గెటౌటుతా, నువ్వెట్లా గేట్టవకుండా వుంటావో చూస్తా—గెటౌట్—గెటౌట్—గెటౌట్.

తను ఆ మునసబునా మర్చిపోయేది? ఇంత చేసిన మనిషిని ఎట్లా మర్చిపోతాడు. రాబందు ఇంకా చూస్తూవుంది. 'ఏంరా అట్లా చూస్తావు, గెటౌట్' రాయి తీసుకోని విసిరాడు. అది తప్పించుకోంది 'ఇంకా చూస్తావ్' మళ్లీ విసిరాడు ఎగిరింది. మళ్లీ ఎగిరింది.

కాకులు అరుస్తూవున్నాయి. రాబందులు కోపంగా చూస్తూవున్నాయి. గద్దలు పీతురుగద్దలూ గుమిగూడాయి. అవి ఎగరకుండా ప్రక్క పొలం కందిమోళ్లలో నడుస్తుంటే కులుకుతున్నట్టు వుంది.

వాటి నడత చూస్తుంటే లేచిపోయిన పెళ్లాం, ఊడిపోయిన గొళ్లెం గుర్తుకు వచ్చింది. కసి! కోపం! డబ్బు తీసుకుపోయింది. అవమానం తెచ్చిపెట్టింది. తనను వదిలేసింది! వాణ్ణి తగులుకు పోయింది. పో తే పో యిం ది. పోనేపోయింది ఉద్యోగం! రాదీ ఉద్యోగం. రాదా పెళ్లాం! వద్దా పెళ్లాం! వద్దీ పెళ్లాం! కులుకుతూ వుందిది. కులుకుతున్నాయివి.

చంపాలి వీటిని. చంపేయాలి వీటిని పొలం గట్టుమీద రాళ్లు! రాయి వెంట రాయి! అయితే కాకి, కాకిపోతే గద్ద! లేదంటే రాబందు! ఒక్కటీ చావదు. అన్నీ తప్పించుకొం టున్నాయి.

చంపాలి వీటిని. చంపేయాలి వీటిని. చంపి పారేయాలి వీటిని కోపంగా చూస్తున్నాయి. అరుస్తున్నాయి. గోల పెడుతున్నాయి. అల్లరి చేస్తున్నాయి, అయినా పోవు! పోనే పోవు!

లంచ మివ్వని బీదపిల్లల్లాగా బీదపడ్డు! లంచ మివ్వని, లంచ మిచ్చే మంచి చెడ్డ కరణాల్లాగా, బెదిరించే, మందలించే, లొంగిపోయే ఎదురుతిరిగే దొంగ, మంచి మునసబుల్లాగా, అరిచే రైతులు, ఎగిరే ప్యూను ఏడ్చే జనం, తిక్కలోకం తిక్కలోకం, తిక్కవి ఒకటా రెండా! అయిదు పది పాతిక వందా! ఎన్నని యివి! ఎన్నని ఈ పక్షులు! ఎన్నని ఈ రాళ్లు అయిదు పది పాతిక, వంద! చేయినొప్పి! వెళ్లవు. ఎదురు తిరిగి చూస్తాయి ఏమిటివి? ఏం వాళ్లుపాగరు?

విసిరాడు రాయి! తగిలింది దెబ్బ! విసిరాడు రాయి! తప్పించుకొంది దెబ్బ! విసురు! విసురు! తగిలింది తప్పించుకొంది గుంపు! కాకుల గుంపు! డబ్బులేని సంతకాలు కావలసినవారి గుంపు! గద్దలగుంపు, రైతులు, వెర్రి మొఖాలు, డబ్బులేని ముఖాలు! దిక్కులేని ముఖాలు, పీతురుగద్దలు గుంపు. కరణాలు తప్పుడు లెక్కలు! దొంగతిండి! దొంగ ఎత్తులు! రాబందులు గుంపు! మునసబులు లొంగిపోయేవాళ్లు! నెత్తినెక్కేవాళ్లు, గుంపులు అన్నీ లేచాయి. ఏకమయ్యాయి! అల్లరి! గోల కాకి గోల, రోతగోల! వెళ్లిపోవటంలేదు. ఎటో పోవటంలేదు ఇటే వస్తున్నాయి. తనవైపే వస్తున్నాయి. వచ్చాయి. అన్నీ వందలువందలు! మీదపడ్డాయి. కరుస్తున్నాయి. పీకుతున్నాయి. రక్కుతున్నాయి. చేతులతో బలంకొద్ది కొట్టాడు. చంపిపారేయబోతున్నాడు. చెడా మడా కొట్టాడు.

కాళ్లుపట్టుకొని నేలకేసి కొట్టాడు. మెడపట్టుకొని చెట్టుకేసి కొట్టాడు. రెక్కలు పట్టుకొని రాళ్లకేసి కొట్టాడు.

ముఖం గీరినట్లు అయింది. తలమీద, బరువు పడ్డట్లు అయింది. తలమీద, మెడమీద, చేతులుమీద, కాళ్లమీద, వళ్లంతా బరువు పొడుస్తున్నాయి. గీరుతున్నాయి. బరువు భరింపలేకపోయాడు. తల తిరిగిపోతూవుంది. కాళ్లలో ఏదో పొడుచుకొన్నట్లయింది. పారిపోబోయాడు. తోవ తెలియటంలేదు. కళ్లు చేత్తో తడుముకొన్నాడు. తడి అయింది. నడవబోయాడు. పడిపోయాడు. ఎద్దు దక్టెంమీద కాకులు, గద్దలు, పీతురుగద్దలు రాబందులు ఎక్కివున్న దృశ్యం కనబడ్డట్లు అయింది. మెడమీద తెగినట్లు బాధ. నోటిమాట రావటంలేదు. అరవబోయాడు. వీలుకావటంలేదు.

కొంచెంసేపటి తరువాత, కాకులు, అరవటంలేదు. గద్దలు గోలచేయటంలేదు. పీతురుగద్దలు కదలటంలేదు. రాబందులు మెదలకుండా కూర్చున్నాయి, కందిమోళ్ల పొలంలో.

అల్లంతదూరంలో వేపచెట్టు క్రింద పిసరంత మాంసంలేని తెల్లని ఎముకల ఎద్దుదక్టెం, పొలంగట్టున రాళ్లగుట్ట దగ్గర మనిషి దక్టెం.